క్లుప్తంగా

అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514కు ఫోన్ చేయాలి.

కుమార్తె చెంతకు తల్లి



కుమార్తెకు తల్లిని అప్పగిస్తున్న మేనేజర్ జ్యోతిర్మయి, పీసీ షేక్‌మదీనా

సీతమ్మధార : దీనమైన స్థితిలో రోడ్లపై తిరుగుతున్న వృద్ధురాలు నరసమ్మ (75)ను ఆమె కుమార్తెకు అప్పగించారు. ఉక్కునగరం పరిసర ప్రాంతాల్లో తిరుగుతుండగా స్థానికుడు చెల్లూరి భాస్కరరావు పోలీసుల సాయంతో ద్వారకానగర్‌లో గల జీవీఎంసీ – ఏయూటీడీ వసతిగృహానికి సోమవారం తరలించారు. ఆమె ఊరు పేరు పాలవలస అని మాత్రమే చెప్పడంతోపాటు, అంతకు మించి వివరాలు చెప్పలేకపోవడంతో అక్కడే ఉంచారు. ఇంతలో తల్లి కోసం వెతుక్కుంటూ ఆమె కుమార్తె ఇనపకుర్తి లక్ష్మి ఎయిర్‌పోర్టు జోన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ షేక్ మదీనాతో కలిసి షెల్టర్‌కు రావడంతో మేనేజర్ జ్యోతిర్మయి, కేర్ టేకర్స్ ప్రశాంత్, శ్రీనివాస్ కలిసి నరసమ్మను అప్పగించారు.

ఎలక్ట్రికల్ రంగంలో ఉపాధి అవకాశాలు

మురళీనగర్ : ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ రంగంలో అనేక ఉపాధి అవకాశాలున్నాయని ఆదానీ గంగవరం పోర్టు ఎలక్ట్రికల్ విభాగం డీజీఎం కె.సతీష్ కుమార్ అన్నారు. కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం 5వ సెమిస్టర్ విద్యార్థులకు నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించాలంటే సబ్జెక్టుపై పట్టు సాధించడంతోపాటు సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. శిక్షణ విభాగం ట్రైనర్ టి.రవిచంద్రన్ విద్యార్థులకు ఎలక్ట్రికల్ విభాగంలో ఉన్న అవకాశాలు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన నిర్వహించారు.

శివాలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న సంస్థ సభ్యురాలు సూరాడ దానియ్యమ్మ, తదితరులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 39వ వార్డు పరిధి చిలకపేటలో వెలసిన ఉమా నీలకంఠేశ్వర శివాలయానికి స్వామి వివేకానంద సంస్థ తరఫున రూ.5 వేల విరాళాన్ని ఆలయ ధర్మకర్త తాతారావుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ శివాలయంలో గల విగ్రహాన్ని కాశీ పుణ్యక్షేత్రం నుంచి తీసుకొచ్చి ప్రతిష్టించారని, ఆలయ అభివృద్ధికి స్వామి వివేకానంద సంస్థ విరాళం అందిస్తుందని, దాతలు ముందుకొచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సూరాడ దానియ్యమ్మ, శాంతి, పార్వతి, రామ జనని, సుజాత, ఉమాదేవి, కనకమహాలక్ష్మి, శ్యామల, నూకరత్నం, రామలక్ష్మి, సావిత్రి, స్థానికులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ వితరణ

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్.వి.ఎస్. కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 11మంది విద్యార్థుల పరీక్ష ఫీజులను లయన్స్ క్లబ్ చెల్లించింది. ఆ మొత్తాన్ని లయన్స్ క్లబ్ ప్రతినిధి దుర్గాప్రసాద్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాతకు సోమవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత విద్యకు సహాయం అందించడంలో భాగంగా ఒక్కొక్క విద్యార్థికి రూ.600 చొప్పున 11 మంది విద్యార్థులకు సంబంధించి రూ.6600 అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మూతపడిన రామకృష్ణా థియేటర్



పరమేశ్వరి పిక్చర్ ప్యాలెస్

థియేటర్లు క్లోజ్..!

పాత తరం సినిమా హాళ్లు మూసివేత

ఆధునీకీకరించలేక వదిలేస్తున్న యాజమాన్యాలు

డాబాగార్డెన్స్: మహా విశాఖలోని పాత నగరంలో సినిమా థియేటర్లు ఒక్కొక్కటిగా మూత పడుతున్నాయి. దాదాపు వందేళ్ల చరిత్ర గల సినిమా థియేటర్లు పాత నగరంలోనే ఉండేవి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతుండడంతో పాత తరం సినిమా థియేటర్లు కనుమరుగవుతున్నాయి. వందేళ్ల చరిత్ర గల బీచ్‌రోడ్డులోని మినర్వా సెలెక్ట్ థియేటర్ గతంలోనే మూత పడగా నాలుగు దశాబ్దాల కిందటే లక్ష్మీ టాకీస్, కృష్ణా థియేటర్లు మూతపడ్డాయి. తాజాగా మరికొన్ని థియేటర్లు కూడా మూతపడుతున్నాయి.

ప్రత్యామ్నాయ వ్యాపారాల నిర్వహణకు...

మారుతున్న కాలానికి అనుగుణంగా పాత తరం సినిమా థియేటర్లు అభివృద్ధి చేయలేక, వాటిని ఆధునికంగా తీర్చిదిద్దలేక, సినిమాలు నడపలేక యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. దీంతో ఎన్నో థియేటర్లు మూతపడ్డాయి. విశాఖపట్నంలో సినిమా థియేటర్లంటే అందరికీ గుర్తొచ్చేవి నవరంగ్, జ్యోతి, పూర్ణ, సత్యనారాయణ, రామకృష్ణ, మనోరమ, గీత్ – సంగీత్, కమల్, రాజ్‌కమల్, పరమేశ్వరి... ఇలా ఎన్నో మరెన్నో. ప్రస్తుతం ఓటీటీల ప్రభావం ఆయా థియేటర్లపై తీవ్రంగా పడింది. దీంతో ఒక్కొక్కటిగా ఆ థియేటర్లు కనుమరుగవుతున్నాయి. 96 ఏళ్ల చరిత్ర గల పూర్ణా థియేటర్ ప్రస్తుతానికి ఉన్నా సినిమాలు వేయడం లేదు. పూర్ణా థియేటర్ చుట్టూ కమర్షియల్ కాంప్లెక్స్‌లు నడుస్తున్నాయి. కొంత కాలం ఈ థియేటర్లో గుర్రపు రేసింగ్స్ బెట్టింగ్‌లు జరిగేవి. పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడంతో గుర్రపు రేసింగ్స్ బెట్టింగ్‌లు నిలిపి వేశారు. ప్రస్తుతం పేరుకే పూర్ణా థియేటర్ ఉంది. ఇదిలా ఉండగా జ్యోతి థియేటర్‌ను మల్టీప్లెక్స్ తరహాలో నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. మెయిన్‌రోడ్డులో గల ప్రభాత్ థియేటర్, అలంకార్ థియేటర్లు ఇప్పటికే మూత పడ్డాయి. ప్రభాత్ థియేటర్ స్థానంలో కమర్షియల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయగా.. పూర్ణామార్కెట్‌కు కూతవేటు దూరంలోని సత్యనారాయణ థియేటర్‌ను పూర్ణా కాంప్లెక్స్‌గా, నవరంగ్ థియేటర్ స్థానంలో అపార్టుమెంట్లు నిర్మించారు. అక్కడికి వంద మీటర్ల దూరంలో ఉన్న రామకృష్ణా థియేటర్ చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసినప్పటికీ థియేటర్ మాత్రం ఇప్పటికీ ఉన్నా.. అందులో సినిమాలు ఆడడం లేదు. తాజాగా మనోరమ థియేటర్‌ను పూర్తిగా కూలగొట్టారు. అక్కడ కూడా అపార్టుమెంట్లు, మల్టీప్లెక్స్ తరహాలో నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇదంతా ఓటీటీల ప్రభావమేనని పాత తరం నాటి అభిమానులు వాపోతున్నారు.



ఒకప్పటి సత్యనారాయణ థియేటర్ స్థానంలో అపార్టుమెంట్లు



ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ప్రతీది సెల్‌ఫోన్ ద్వారానే సాగిపోతోంది. మంచి, చెడు సెల్‌ఫోన్ల ద్వారానే జరుగుతున్నాయి. కొత్త సినిమా వచ్చిందంటే సెల్‌ఫోన్లలోనే చూసేస్తున్నారు. థియేటర్లతో పని లేకుండా పోతుంది. అలాగే ఐనాక్స్ థియేటర్లు కూడా ఎక్కడికక్కడ వెలుస్తుండడంతో పాత సినిమా థియేటర్లలో సినిమాలు ఆడించే వారు నానాటికీ తగ్గిపోతున్నారు. ఫలితంగా పాత థియేటర్లు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి.



ఒకప్పటి నవరంగ్ థియేటర్.. ప్రస్తుత పూర్ణా ట్రేడ్ సెంటర్

పలువురు కళాకారులకు అవార్డులు



చిన్నారులు, కళాకారులతో ఇంద్రాణి

డాబాగార్డెన్స్: పాత నగరానికి చెందిన నాట్యదీపిక అకాడమీ వ్యవస్థాపకురాలు ఇంద్రాణి నరేంద్ర నేతృత్వంలో పలువురు చిన్నారులు ప్రతిభ చూపారు. కూచిపూడిలో డబుల్ డిప్లొమో చేసేందుకు లండన్ వెళ్లిన ఇంద్రాణి అక్కడి తెలుగు వారికి, ఆ దేశస్థులకు కూచిపూడిలో శిక్షణ అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం లండన్‌లో 'నాట్య సమ్మేళనం' నిర్వహించారు. ఆ ప్రదర్శనలో పలువురు ఇంద్రాణి శిష్యులు బాల నర్తకి అవార్డులు పొందారు. అలాగే వయసుతో సంబంధం లేకుండా కూచిపూడిని ముందుకు తీసుకెళ్తున్న పలువురికి ఆదర్శ నర్తకి పేరిట అవార్డులు అందజేశారు. యునైటెడ్ కింగ్‌డమ్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ వెంకట పద్మ కిల్లి, అసోసియేషన్ అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి పాల్గొని అవార్డులు బహూకరించారు. కూచిపూడిలో ఎంఎస్ చేసేందుకు లండన్ వెళ్లి అక్కడ ఎంతో మంది పిల్లలకు శిక్షణ ఇస్తున్నందుకు గర్వంగా ఉందని అకాడమీ వ్యవస్థాపకురాలు ఇంద్రాణి నరేంద్ర 'సాక్షి'కి తెలిపారు.

కనక మహాలక్ష్మి ఆలయంలో ఆయుష్ హోమం



ఆయుష్ హోమం నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

డాబాగార్డెన్స్: కనక మహాలక్ష్మి దేవస్థానంలో సోమవారం అమ్మవారి జన్మ నక్షత్రం సందర్భంగా ఆయుష్ హోమం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు నిర్వహించిన హోమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

ముక్కంటికి విశేష అభిషేకాలు



పూజలు చేస్తున్న అర్చకులు



అభిషేకంలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ముక్కంటిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా శివయ్యకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. నియోజకవర్గంలో టూ టౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో ఉమా చంద్రమౌళీశ్వర స్వామికి అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. డీబీకే రైల్వే క్వార్టర్స్‌లో గల శ్రీ భవానీ శంకర గణపతి ఆలయంలో, బౌడరా రోడ్డులో గల శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయం, మురళీధర వీధిలో గల పంచముఖేశ్వర స్వామి దేవాలయంలో విశేషంగా పూజలు చేశారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి రమాభాయ్, ఆలయ సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు.

నిరుద్యోగుల ఉపాధి కల్పనకు శిక్షణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: పలు ప్రభుత్వ పథకాలకు సంబంధించి నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ ఇచ్చేందుకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సోమవారం విడుదల చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో త్వరలో శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. 75 శాతం హాజరున్న అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌తోపాటు శిక్షణ అనంతరం ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగం కల్పించడానికి చర్యలు తీసుకుంటారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్‌డీఏ పీడీ బి.లక్ష్మీపతి, డుమా పీడీ ఆర్.పూర్ణిమాదేవి, ఇతర అధికారులు ఎ.కళ్యాణి, జగదీశ్వరి పాల్గొన్నారు.

సమగ్ర కుల గణనకు వినతి



మాట్లాడుతున్న పల్లా రమణ

మహారాణిపేట: కులగణన జరిపిన తర్వాతనే రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పల్లా రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓబీసీలకు రాజ్యాంగ బద్ధంగా రాయితీలు, రిజర్వేషన్ల కోసం అనేక దశాబ్దాలుగా ఉద్యమాలు చేస్తూనే ఉన్నామన్నారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు ఓబీసీ కమిషన్లు వేసి, వారి స్థితిగతులపై అధ్యాయనం చేయించిందని, అన్ని కమిషన్లు దేశ జనాభాలో 52 శాతం ఓబీసీలు ఉన్నారని తెలిపిందన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేయాలని కలెక్టర్‌ను కోరామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం నాయకులు ఎర్ని శ్రీనివాసరావు, శివ ప్రసాద్‌రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి లక్ష దీపోత్సవం



మాట్లాడుతున్న శ్యామ మాధవ దాసా

డాబాగార్డెన్స్: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గంభీరంలో గల అక్షయపాత్ర ఫౌండేషన్ వంటశాల పక్కన హరే కృష్ణ వైకుంఠ మందిర నిర్మాణ ప్రాంగణంలో లక్ష దీపోత్సవం ఈ నెల 27 నుంచి డిసెంబర్ 1 వరకు నిర్వహించనున్నట్టు హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి శ్యామ మాధవ దాసా తెలిపారు. సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా ఆకాశ దీపం, తొలి దీపం, సాంస్కృతిక కార్యక్రమాలు, దామోదర హారతి, భక్తులచే దీపోత్సవం, ప్రసాద వితరణతో పాటు శ్రీభగవానుని ఆరాధన ఉంటుందన్నారు. ఆరాధనలో ప్రతి రోజూ శ్రీకృష్ణుని ఆలయాన్ని సందర్శించాలని, నెయ్యి దీపం అర్పించాలని, దామోదర అష్టకాన్ని ప్రతి రోజు పాడాలని, దానం చేయాలని, తులసీ దేవికి పూజ చేయాల్సి ఉంటుందన్నారు. నెయ్యి దీపంతో శ్రీకృష్ణుని ఆరాధించడం కార్తీక మాసంలో అత్యంత ముఖ్యమైనదిగా పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 90106 11108 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

మీకు తెలుసా..

డాబాగార్డెన్స్ : నగరంలో ఉద్యమాలు చేసేందుకు, నిరసన ప్రదర్శనలు ప్రారంభించేందుకు కేంద్రమైన అంబేడ్కర్ కూడలిలో భారత రాజ్యాంగ రచయిత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు 1990 ఏప్రిల్ 14న అప్పటి మేయర్ డీవీ సుబ్బారావు నాంది పలికారు. అనంతరం అక్కడ పార్కు అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ కూడలి కేంద్రంగా వేలాది ఉద్యమాలు, నిరసన ప్రదర్శనలు జరిగాయి. మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఇక్కడ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



అందరి సహకారంతో కాలుష్య నియంత్రణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒక్క రోజు అందరూ ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని నియంత్రించవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీకి సోమవారం ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను వినియోగించాలని నిర్ణయం తీసుకుని, ఉద్యోగులతోపాటు అందరం పాటిస్తున్నామన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించాలి



వినతిపత్రం స్వీకరిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం: ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని జోన్ – 5 జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆదేశించారు. జ్ఞానాపురంలోని కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో పలు సమస్యలపై ఆరుగురి నుంచి ఆయన నేరుగా వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 03, రెవెన్యూకి 02, వాటర్ వర్క్స్‌కు సంబంధించి ఒక వినతి అందినట్లు తెలిపారు. జోన్ పరిధిలోని టౌన్ ప్లానింగ్‌పై అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయని, వార్డు పర్యటనలోనూ ఇదే విభాగానికి సంబంధించి సమస్యలు కనిపిస్తున్నాయని ఏసీపీ, టీపీవోలు పర్యవేక్షించాలని జెడ్సీ సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఏపీడీవో ఎన్.పుణ్యవతి, ఏఈలు సుమన్, సతీష్ పాల్గొన్నారు.

సీఐటీయూ సభ జయప్రదం చేయండి

సీతమ్మధార: ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళవారం చేపట్టనున్న ప్రదర్శనను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్ సోమవారం కోరారు. అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా నవంబర్ 26న భారీ ఎత్తున నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చాయని గుర్తు చేశారు. మంగళవారం దొండపర్తి రైల్వే డీఆర్‌ఎం ఆఫీస్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రదర్శనలో కార్మిక వర్గం భారీగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కార్మికులకు నష్టం చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. ఆందోళనలో కార్మికులు భారీగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తప్పుడు ఫిర్యాదులు చేస్తున్న వారిపై చర్యలకు వినతి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న యూసఫ్ మాలిక్

డాబాగార్డెన్స్: నూతనంగా ఏర్పడిన మసీదు – ఇ – ఉస్మానియా వెల్ఫేర్ అసోసియేషన్‌పై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్న కమిటీ మాజీ అధ్యక్షుడు షేక్ సుభానీపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ యూసఫ్ మాలిక్ సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యూసఫ్ మాలిక్ మాట్లాడుతూ పాత కమిటీకి అధ్యక్షుడిగా వ్యవహరించిన షేక్ సుభానీ ప్రస్తుత కమిటీపై పోలీసులు, అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుత కమిటీ సభ్యులను డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ విచారించి సుభానీ చేసిన ఫిర్యాదులు అవాస్తవమని తేల్చిచెప్పారన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతోపాటు అబ్దుల్ భాషా ఉన్నారు.

నైపుణ్యాలతో ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం లయన్స్ క్లబ్ సహకారంతో ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ విద్యార్థులు సకాలంలో ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవడానికి నైపుణ్య శిక్షణ దోహదపడుతుందన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి జి.రాంబాబు మాట్లాడుతూ ప్రస్తుత ఉద్యోగ అవకాశాలు, అర్హతలను వివరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ కేవీ సుబ్బరాజు, ప్రెసిడెంట్ ఎం.సురేష్‌కుమార్, కమిటీ సభ్యులతోపాటు ప్లేస్‌మెంట్ కో ఆర్డినేటర్ ఎం.విద్యాకల్పన, ఇంటర్న్‌షిప్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.హైమావతి, డి.అరుణపద్మ, డాక్టర్ ఆర్.కిరణ్మయి పాల్గొన్నారు.

ఏవీఎన్‌లో ఎన్‌సీసీ డే



ఎన్‌సీసీ దినోత్సవంలో కేడెట్స్, అధికారులు

డాబాగార్డెన్స్: స్థానిక ఏవీఎన్ కళాశాలలో 13వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ డే వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా పేరెడ్ నిర్వహించి, ఎన్‌సీసీ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు, 13వ ఆంధ్రా బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్ణిమ్ ప్రభత్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఏజీబీ శంకర్, అధిక సంఖ్యలో కేడెట్స్ పాల్గొన్నారు.